ప్రజాశక్తి
బుధవారం 4 జనవరి 2023



'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం : వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు మూడు, నాలుగు తరగతులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలని స్పష్టం చేశారు. మే 1, 2011 నుంచి ఏప్రిల్ 20, 2013 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. సంబంధిత హెచ్ఎంతో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాయితీ లేని రుణమేల..?

- ఎన్‌హెచ్ఎఫ్‌డిసి రుణాలపై వికలాంగుల అనాసక్తత
- జిల్లాకు రూ.కోటి కేటాయింపు
- రూ.82 లక్షల రుణానికే దరఖాస్తులు
- రూ.78 లక్షలను విడుదల చేసిన ప్రభుత్వం

అవి సబ్సిడీ రుణాలు కాదు. అయినా కఠిన నిబంధనలు పెట్టారు. జిల్లాకు రూ.కోటి కేటాయించారు. కానీ పలు ఆంక్షలతో కొద్దిమంది మాత్రమే అర్హత సాధించగలిగారు. ఫలితంగా జాతీయ వికలాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డిసి) కేంద్ర దివ్యాంగజన స్వావలంబన యోజన (డిఎస్‌వై) పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రుణ పథకం ఎందుకూ కొరగాకుండా పోయింది. కఠిన నిబంధనలు పెట్టడంతో దరఖాస్తు చేసేందుకూ ముందుకు రాలేదు. దీంతో జిల్లాకు కేటాయించిన యూనిట్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా స్వయం ఉపాధి పొందాలనుకున్న వికలాంగులకు నిరాశే మిగిలింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జాతీయ వికలాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఎఫ్‌డిసి) ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి దివ్యాంగజన స్వావలంబన యోజన (డిఎస్‌వై) పేరుతో రుణ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది ఆగస్టులో దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 31 మందిని అర్హులుగా అధికారులు తేల్చారు.

వీరికి రూ.82 లక్షల మేర రుణం అందించాల్సి ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.78 లక్షలు మాత్రమే విడుదల చేసింది. వాస్తవానికి వికలాంగులకు ఈ పథకం ద్వారా రూ.కోటి వరకు రుణం కల్పించే అవకాశం ఉంది. రుణాలకు తగినంత మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో, రూ.18 లక్షలు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. రుణ సౌకర్యానికి అర్హత సాధించిన 32 మందికి వచ్చే నెల మూడో తేదీన జాతీయ వికలాంగుల దినోత్సవం రోజున రుణాలను మంజూరు చేయనున్నట్లు అధికారులు చెప్తున్నారు.



వడ్డీతో పాటు అపరాధ రుసుము వసూలు

దివ్యాంగజన స్వావలంబన యోజన కింద జిల్లాకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. ఈ డబ్బులతో వికలాంగులకు వ్యాపార, సేవా రంగాల యూనిట్లను నెలకొల్పడం, వ్యాపారాన్ని అభివృద్ధి పరచడానికి రుణాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రుణాల అందజేతను రెండు కేటగిరీల కింద విభజించింది. రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు ఒక కేటగిరీగా, రూ.50,001 నుంచి రూ.ఐదు లక్షల వరకు రెండో కేటగిరీగా పేర్కొంది. మొదటి కేటగిరీ కింద రుణాలు తీసుకున్న వారికి ఏడాదికి ఐదు శాతం, రెండో కేటగిరీ కింద రుణాలు పొందే వారి నుంచి ఆరు శాతం చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. రూ.లక్ష వరకు తీసుకున్న రుణాన్ని మూడేళ్లలో, రూ.ఐదు లక్షల వరకు తీసుకున్న రుణాన్ని ఐదేళ్ల లోపు చెల్లించాలని పేర్కొంది. ఒకవేళ రుణాన్ని నిర్దేశించిన సమయంలో చెల్లించకపోతే వార్షిక వడ్డీకి అదనంగా మరో మూడు శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

కఠిన నిబంధనలే కారణమా?

రుణ పథకానికి సబ్సిడీ లేకపోవడంతో పాటు వడ్డీ భారంగా ఉండడంతో, వికలాంగుల నుంచి పెద్దగా స్పందన కనపడడం లేదని తెలుస్తోంది. రూ.లక్ష వరకు రుణాన్ని పొందాలంటే ఐదేళ్ల సర్వీసు ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, రూ.లక్ష దాటి రుణం పొందాలంటే పదేళ్ల సర్వీసు ఉన్న ప్రభుత్వ ఉద్యోగితో ష్యూరిటీ ఇప్పించాలంటూ నిబంధన విధించింది.

నిరుపేద వికలాంగులకు ష్యూరిటీ ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవడమూ మరో కారణంగా కనిపిస్తోంది. దీంతోపాటు రుణం పొందేందుకు ఏ వ్యాపారం చేయాలనుకుంటున్నారో ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు విలువ రూ.లక్ష దాటితే జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారుల నుంచి అంచనా నివేదికను తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) నుంచి ఎన్ఒసి కూడా పొందాలి. దీంతో ఎన్ఎఫ్‌డిసి అందివ్వనున్న రుణాలపై వికలాంగుల్లో నిరాసక్తత నెలకొంది.



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజారోగ్యానికే ప్రథమ ప్రాధాన్యం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీలో రూ.1.09 కోట్లతో నిర్మించిన వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వెళ్తే సరైన వైద్యం అందదనే భావన అందరిలో నాటుకుపోయిందన్నారు. వైసిపి ప్రభుత్వం దాన్ని తుడిచిపెట్టి ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 900 పడకలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మంచి వైద్యులతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. తనకు కోవిడ్ వచ్చినప్పుడూ ప్రభుత్వాస్పత్రిలోనే చేరానని చెప్పారు. సుమారు 65 టెస్టులు అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో వాలంటీర్లు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల పెంపుదలే లక్ష్యం

పేదల జీవన ప్రమాణాల పెంపుదలే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తోందని మంత్రి ధర్మాన అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన మాట్లాడారు. మాయమాటలు చెప్పే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో జన్మభూమి కమిటీల దుర్మార్గానికి ఏ విధంగా ఇబ్బందులు పడ్డారో గుర్తుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, ఎంపిపి అంబటి నిర్మల శ్రీనివాస్, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, నాయకులు చిట్టి జనార్ధనరావు, చల్లా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మంగళవారం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 320 కింద రాజీపడదగిన కేసులు, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం సెక్షన్ 138 కింద చెక్‌బౌన్సు కేసులు, అన్ని సివిల్ కేసులు, మోటారు వాహన చట్టం కేసులు, బీమా, చిల్లర తదితర కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.



జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఇందుకు కోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం లభించడమే కాకుండా ఇచ్చిన తీర్పు తుది తీర్పుగా ఉంటుందని, అప్పీలు చేసుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. కోర్టు వివాదాల్లో చిక్కుకుని అనవసరపు ఖర్చులతో పాటు మానసిక ప్రశాంతత లోపిస్తుందని, అటువంటి వారికి ఆమోదయోగ్యమైన రాజీ వల్ల సమన్యాయం చేకూరుతుందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళా ఉత్పత్తులకు చేయూత

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- డ్వాక్రా బజారు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

స్వయం సహాయక బృందాల్లోని మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు తగిన చేయూతను ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. నాబార్డు, యూనియన్ బ్యాంకు సౌజన్యంతో నగరంలోని ఏడురోడ్ల కూడలిలో గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజారును మంగళవారం ప్రారంభించారు. స్టాళ్లను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన దేశంలో ప్రభుత్వాలు అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యపడదని, 70 ఏళ్లుగా చూస్తున్న వాస్తవం ఇదన్నారు. అందుకే గ్రామీణ ప్రాంతాల్లో కొందరు వ్యవసాయం దిశగా, మరికొందరు సంప్రదాయ చేతివృత్తులు, వృత్తి నైపుణ్య వస్తు సామగ్రిని తయారు చేసి మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన వస్తు సామగ్రి ముందు సంప్రదాయ చేతివృత్తులు దెబ్బతిన్నాయని, అటువంటి వారందరికీ మార్కెటింగ్ కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. సంప్రదాయ చేతివృత్తుల వారు మార్కెటింగ్ చేసుకునే ఆర్థిక స్తోమత వారికి ఉండబోదని చెప్పారు.

అందుకోసమే డ్వాక్రా బజారు పేరిట మహిళలు, గిరిజనులు తయారు చేసిన వస్తువులన్నింటినీ ఒకే వేదిక పైకి తీసుకొచ్చి ప్రదర్శన, విక్రయాలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదిన రోజుల్లో నలుమూలల నుంచి నగరానికి బంధువులు వస్తుంటారని, వారందరూ పలు ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన వస్తువులు, తినుబండారాలకు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా ఈ బజారులోనే లభ్యమయ్యేలా డిఆర్‌డిఎ ఏర్పాట్లు చేసిందన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు చేసిన ఉత్పత్తులకు తగిన చేయూతను అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మీడియా కూడా దీనిపై తగిన ప్రచారం కల్పించి, పెద్దఎత్తున ప్రజలు సందర్శించి వస్తువులను కొనుగోలు చేసేందుకు సహకరించాలని కోరారు. వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ డ్వాక్రా బజారును ప్రతిఒక్కరూ సందర్శించి విజయవంతం చేయాలని, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందించాలని ఆయన కోరారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అనంతరం సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహిళా రైతు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆరోగ్యం-ఆదాయం కార్యక్రమం పేరిట శ్రీకాకుళం మండలంలో ఐదు వేల మందికి ఆరోగ్యాన్ని అందించేందుకు మునగ మొక్కలను మహిళలకు పంపిణీ చేశారు. తొలుత సంప్రదాయం గురుకులం ఆధ్వర్యంలో లీలాకృష్ణ నృత్య బృందం చేసిన నృత్యాలు, సాయి విద్యామందిర్ విద్యార్థి తన్మయి చేసిన నృత్యం ఆద్యంతం తిలకించిన ఆయన వారిని అభినందించారు. కార్యక్రమంలో మహిళా ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ బి.హేమమాలిని రెడ్డి, పోలినాటి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.కృష్ణవేణి, ఐటిడిఎ పిఒ బి.నవ్య, నాబార్డు డిడిఎం వరప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు ఎం.కృష్ణవేణి, పలు స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ జెసికి 18 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని జెసి ఛాంబరులో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ జెసి కార్యక్రమానికి తొమ్మిది ఫోన్ కాల్స్ వచ్చాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలో రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. పంట పొలాల నుంచి కొనుగోలు కేంద్రాల వరకు ధాన్యం రవాణా ఖర్చులను ప్రభుత్వం చెల్లించాలన్నారు. లేకుంటే రైతులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అందుబాటులో ఉన్న మిల్లుకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాకాకుండా దూరప్రాంతాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాలని రైతుభరోసా కేంద్రం సిబ్బంది చెప్తున్నారని మందస మండలం హరిపురం నుంచి నాగేశ్వరరావు తెలిపారు. జి.సిగడాం నుంచి గార మిల్లుకు ట్యాగ్ చేశారని, రవాణా ఎలా సాధ్యమవుతుందని జి.సిగడాంకు చెందిన రైతు రాంబాబు ఫిర్యాదు చేశారు. తేమ శాతం ఉందని బస్తాకు ఐదు కేజీల ధాన్యం తరుగును రైతులు భరిస్తున్నారని, ఆపై మిల్లుల వద్ద మరో మూడు కేజీలు మట్టి పేరుతో తీసుకుంటున్నారని పొందూరు మండలానికి చెందిన రైతు ఫిర్యాదు చేశారు.



మెట్టూరు రైతుభరోసా కేంద్రం పరిధిలో రైసు మిల్లులకు టార్గెట్, బ్యాంకు గ్యారంటీ లేనందున ధాన్యం కొనుగోలు చేయడం లేదని కొత్తూరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలక రవి తెలిపారు. వాటికి సిఎంఆర్ డెలివరీ త్వరగా చేయించి రొటేషన్ పద్ధతిలో బ్యాంకు గ్యారంటీ వచ్చేలా చేస్తామని చెప్పారు. మర్రిపాడు రైతుభరోసా కేంద్రానికి దూరంగా ఉన్న నిమ్మాడ మిల్లులను ట్యాగ్ చేశారని, తమకు దగ్గరగా ఉన్న బూరగాం, టెక్కలి మిల్లులు మూడు కిలోమీటర్లు, దిమిలాడ మిల్లులకు ఐదు కిలోమీటర్లలోని మిల్లులను ట్యాగ్ చేయాలని కోరారు. ఏ మండలంలోని మిల్లులను అదే మండలంలో ట్యాగ్ చేయనున్నట్లు తెలిపారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం నుంచి లక్ష్మణరావు మాట్లాడుతూ జిఎల్‌టి ఇవ్వడం లేదని, ధాన్యం రవాణాకు వాహనాలు లేవని, మిల్లుల వద్ద అన్ లోడింగ్ సమస్య ఉందని తెలిపారు. గార మండలం నుంచి ముద్దాడ రామకృష్ణ మాట్లాడుతూ గత నెల 14న ధాన్యం విక్రయించినా, నేటికీ డబ్బులు జమ కాలేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ డిఎం జయంతి, డిఎస్‌ఒ డి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా అమలు చేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అందులో భాగంగానే పెన్షన్ మొత్తాన్ని పెంచిందని చెప్పారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక పెంచిన మొత్తాన్ని రాజమహేంద్రవరం నుంచి సిఎం జగన్ మంగళవారం ప్రారంభించారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వృద్ధాప్య, వితంతువు, వికలాంగ, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పింఛన్లు ఇస్తున్నామని వివరించారు.

జిల్లాలో 3,17,901 మందికి రూ.86.11 కోట్లు ప్రతి నెలా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.2,750 అందజేయనున్నట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిసిఎంఎస్ డైరెక్టర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న స్పీకర్ సీతారాం తదితరులు



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

సకాలంలో పరిశ్రమలకు అనుమతులు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పరిశ్రమలకు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. లెదర్ ఇండస్ట్రీస్ జిల్లాకు దగ్గరలో ఉన్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమలకు సంబంధించి అనుమతులు, రెన్యువల్స్‌పై సమీక్షించారు. విశాఖపట్నంలో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో పాల్గొనాలని చెప్పారు. ఒక్కో గ్రానైట్ కంపెనీకి ఎన్ని సర్వే రాళ్లు నిర్ణయించారో తెలుసుకోవాలని భూగర్భ గనుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని ఆదేశించారు. ఇంతవరకు ఎన్ని సర్వే రాళ్లు సిద్ధం చేశారని జెసి ప్రశ్నించగా, 1.40 లక్షల సర్వే రాళ్లు సిద్ధంగా ఉన్నట్లు డీడీ వివరించారు.

ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజు భూ సమస్యలను జెసి దృష్టికి తీసుకొచ్చారు. మండలాల వారీగా సర్వే నంబర్లు వేసి జాబితా అందజేస్తే సంబంధిత తహశీల్దార్లకు పంపనున్నట్లు జెసి చెప్పారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును జిఎం ఎ.సుధాకర్ వివరించారు. పలు పరిశ్రమలకు రాయితీలు కల్పించినట్లు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు ఉమామహేశ్వరరావు, కార్మిక శాఖ ఉప కమిషనర్ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శంకర్ నాయక్, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రమణారావు, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనతో గరిష్ట కూలి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఉపాధి హామీ కూలీలు సమయ పాలన పాటిస్తూ రెండు పూటలా పనిచేయడం ద్వారా గరిష్ట కూలిని పొందవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని చిలకపాలెం, అల్లినగరం పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వరమన్నారు. ఉపాధి పనుల్లో కూలీలే యజమానులని, అందువల్ల బాధ్యతగా పనిచేసి గరిష్ట కూలిని అందుకోవాలన్నారు. గతంలో ఒక పూటకు పరిమితమై పనులు చేసేవారని, ఫలితంగా తక్కువ కూలి వచ్చేదని చెప్పారు. రెండు పూటలా కనీసం ఆరు గంటల పాటు పని చేసుకునేందుకు వీలు కల్పించామన్నారు. గరిష్ట కూలిని పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బందిని అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన వంద రోజుల పనిదినాలను జాబ్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ అమల్లోకి వచ్చాక జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ శోభారాణి, ఇసి నారాయణమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

గ్రానైట్, క్వారీల పనులు ప్రారంభించాలి


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


జిల్లాలో పనిచేయని గ్రానైట్, క్వారీలు తక్షణమే పనులు ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ చెప్పారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రానైట్, క్వారీ యజమానులు లీజులపై మంగళవారం సమీక్షించారు. గ్రానైట్ కంపెనీలు, క్వారీ లీజుదారులు ప్రస్తుతం నడుపుతున్నదీ, లేనిదీ భూగర్భ గనుల శాఖ డీడీ ఫణిభూషణ్ రెడ్డిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో పనిచేయని 76 గ్రానైట్, లీజు క్వారీ ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలని సూచించారు. ప్రారంభించని క్వారీల లీజులు రద్దు చేస్తామని జెసి చెప్పారు. రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్న వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

లీజుదారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శంకర్ నాయక్, భూగర్భ గనుల శాఖ ఎడి బాలాజీ నాయక్, ఉత్తరాంధ్ర గ్రానైట్ యజమానుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతిరావు, ఇతర యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్





పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సిఐటియు రాష్ట్ర 16వ మహాసభల్లో కార్యదర్శి నివేదికపై శ్రీకాకుళం నుంచి రిపోర్టు ఇస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, డి.సుధ.

- ప్రజాశక్తి, భీమవరం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిబాబు

'వీర గున్నమ్మ' సినిమాను ఆదరించాలి

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

రైతాంగ వ్యతిరేక విధానాలపై మందస జమీందారీలు, బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయని వీర గున్నమ్మ పోరాట త్యాగాలు ఇతివృత్తంగా రూపొందించిన విప్లవ సేనాని వీర గున్నమ్మ సినిమాని ప్రతిఒక్కరూ ఆదరించాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల బల్ల గిరిబాబు పిలుపునిచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ నివాస గృహం వద్ద మంగళవారం వీరగన్నమ్మ సినీ పోస్టర్‌ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వీరవనిత సాసుమాన వీర గున్నమ్మ బ్రిటీష్ వారిని తన ప్రాణాలను ఎదిరించి తన ప్రాణాలు కోల్పోయిందని అన్నారు. ఇంత చరిత్ర కలిగిన మందస ప్రాంతంలో జరిగిన పోరాటంపై ఇతివృత్తంగా తీసిన విప్లవసేనాని వీర గున్నమ్మ సినిమాని ఆదరించాలని కోరారు. ఇటువంటి వీర వనితలపై సినిమా తీయడం ఆనందంగా ఉందన్నారు. జరిగిన కథను సినిమాగా తీయడం ద్వారా భవిష్యత్ తరానికి జరిగిన ఘటనలు తెలుసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి సినిమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ వీర గున్నమ్మ సినిమా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు కూన మోహన్‌బాబు, నంబాల కోదండ రామయ్య, వార్డు కౌన్సిలర్ సనపల సింహాచలం, చిత్ర యూనిట్ ఎల్.విచలం గుంట కోదండ, చాపర వేణుగోపాల్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చిట్టిబాబు, ఆర్.శంకరరావు, మూలమల్లి చంద్రశేఖర్, పి.గజేంద్ర పాల్గొన్నారు.

నేడు ప్రీ రిలీజ్ వేడుక

విప్లవ సేనాని వీర గున్నమ్మ జీవిత చరిత్ర సినిమా విడుదల సందర్భంగా కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు ప్రీ రిలీజ్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు దర్శకులు గూన అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

10న కోటబొమ్మాళి మండల సమావేశం

కోటబొమ్మాళి: ఈ నెల 10న స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు అడిగే ప్రశ్నలకు పూర్తి సమాచారంతో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

పింఛన్ల పెంపుతో జీవితాల్లో కొత్త వెలుగులు

ప్రజాశక్తి- పోలాకి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని ఉరజాంలో సర్పంచ్ కణితి సత్తిబాబు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు అధ్యక్షతన నూతన, పెంచిన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాలు పింఛన్లు ఒకటో తేదీ ఉదయానికే వాలంటీరు ఇంటింటికీ వెళ్లి ఇచ్చే కార్యక్రమం శ్రీకారం చుట్టారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగంలో అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజారంజకంగా పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కణితి సత్తిబాబు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు డోల జగన్, దుంపల భాస్కరరావు, బర్ల వేణు, వైస్ ఎంపిపిలు కలగదండు తాతారావు, కోట అప్పారావు, చింతాడ ఉమా, ఆర్.త్రినాథరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, తహశీల్దార్ శ్రీరాములు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యపాడులో నూతన పింఛన్లను సర్పంచ్ బచ్చల ధర్మారావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, అంగ జోగారావు, మద్దిల తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని ఆరో వార్డు సచివాలయ కన్వీనర్ సనపల రాజు 282 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


పోలాకి : ఉరజాంలో పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ఇచ్ఛాపురం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చినా మాట ప్రకారం పింఛన్లు పెంపు ప్రభుత్వం చేపట్టిందని వైసిపి సమన్వయ కర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల పరిధిలోని కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో పింఛను రూ.2,500 నుంచి రూ.2,750 పెంచినందుకు ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ దేవరాజ్, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వృద్ధుల, వికలాంగుల, వితంతవుల జీవితాల్లో సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కొత్తవెలుగు నింపారని జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మాళి రాము, వార్డు మెంబర్లు, వైసీపీ కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మాసాహెబ్‌పేట పంచాయతీలో ఓ పింఛనుదారులు శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వాలంటీరు కర్రి భారతి ఆయన వద్దకు వెళ్లి పింఛను అందజేశారు. ఆమెకు సర్పంచ్ సంపతిరావు హేమసుందరరాజు అభినందనలు తెలియజేశారు.

జలుమూరు: మండలంలోని పోగోడు పంచాయతీలో నూతన పింఛన్లను సర్పంచ్ మన్మథరావు అందజేశారు. ఆయనతోపాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని అక్కుపల్లి సచివాలయం పరిధిలో 350 మందికి నూతన పింఛన్లను అక్కుపల్లి, భైపల్లి సర్పంచ్‌లు లండ లోలాక్షి, డొంక ఉషలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మడ్డు పరమేశ్వరి, సచివాలయం కన్వీనర్లు యంపల్ల యోగి, డొంక విద్యాసాగర్, ఉప సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : మండలంలోని లొద్దభద్ర సచివాలయంలో నూతన పింఛన్లను ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు పంపిణీ చేశారు. అర్హులెవరికైనా పింఛన్లు అందకపోతే తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, కార్యదర్శి సద్గుణబాబు పాల్గొన్నారు.


పలాస : పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు


కోటబొమ్మాళి : పింఛన్లను పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి వెంకటరావు

మెళియాపుట్టి : మండలంలో బాణాపురం, మారేడుకోట, జాడుపల్లి తదితర పంచాయతీల్లో పింఛన్ల పెంపుపై ఆనందోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, పెద్దింటి భాగ్యం శ్రీనివాసరావు, జాడుపల్లి సర్పంచ్ ప్రతినిధి జనపరెడ్డి కన్నబాబు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని తోటవాడలో పింఛను పెంపుపై సిఎం జగన్ చిత్రపటానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు పింఛను లబ్ధిదారులతో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు, ఎంపిటిసి సుధాకర్, ఉప సర్పంచ్ వెంకటరమణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌతు శిరీష

పలాస: టిడిపి వ్యవస్థాపకులు, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు శత జయంత్యుత్సవాలు ఈ నెల 8న నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస టిడిపి కార్యాలయంలో మంగళవారం జిల్లా టిడిపి, సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ మహానటుడు, ప్రజా నాయకుడు, కథానాయకుడు, తెలుగు వారి కీర్తి, ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చేసిన మహావ్యక్తి, శక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఎన్‌టిఆర్ శత జయంత్యుత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి టిడిపి కుటుంబ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పి.ఎం.జె.బాబు, మొదలవలస రమేష్, గుత్తు చిన్నారావు, టిడిపి సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు విజయం ప్రధాన్, ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ జనరల్ సెక్రటరీ పి.విఠల్ పాల్గొన్నారు.

52 జిఒను రద్దు చేయాలి

టెక్కలి : అగ్రకులాలకు చెందిన బోయి, వాల్మీకి, ఒడ్డి, ఒరియాలను ఎస్‌టి జాబితాల్లో చేర్చేందుకు ప్రభుత్వం యత్నాలు చేస్తుందని, ఇందుకు జారీ చేసిన జిఒ 52ను రద్దు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో 40 లక్షల మంది కలిగిన అగ్రకులాల వారిని 32 లక్షల వరకు ఉన్న ఆదివాసీ తెగల్లో చేర్చాలని యత్నించడం తగదన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూరితంగా జారీ చేసిన ఈ జిఒను తక్షణమే రద్దు చేయాలని, లేకుంటే భవిష్యత్ కార్యాచరణపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈయనతో పాటు సంఘ నాయకులు సవర చొక్కారావు, నడిపింటి నాగరాజు, సలాసన షణ్ముఖరావు, జన్ని కాంతారావు, మెగిలిపాటి జగ్గారావు, సవర కూర్మారావు ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న రాహుల్‌కుమార్ రెడ్డి

కుల ధ్రువీకరణ పత్రాల జారీపై విచారణ

మెళియాపుట్టి : మండలంలో గంగరాజుపురానికి చెందిన గౌతం శరత్ ప్రధాన్ ఎస్‌టి బెంతు ఒరియా కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని న్యాయస్థానానికి ఆశ్రయించారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సందర్శించి మంగళవారం దర్యాప్తు నిర్వహించారు. గతంలో కుల ధ్రువీకరణ పొందిన వివరాలపై ఆరా తీశారు. ఇందుకు సంబంధించి దర్యాప్తు వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. ఆయనతో పాటు తహశీల్దార్ పి.సరోజని, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎడిఎఫ్ఒ ఎం.వరప్రసాదరావు సూచించారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై డెమో నిర్వహించారు. అగ్నిప్రమాద సమయంలో మంటలు ఆర్పేందుకు కార్బన్ డయాక్సైడ్ వినియోగించే తీరును వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదత్తానంద్, అగ్నిమాపక ఎల్ఎఫ్‌పి షణ్ముఖరావు, ఎస్.కె.రహీం, ఎల్.రమణ, వై.పాపారావు, కె.ఎల్.కుమార్, ఉపాధ్యాయులు వాడాడ శ్రీనివాసరావు, టి.వి.రమణమూర్తి, డి.హరనాథం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి- కొత్తూరు

పాతపట్నం నియోజకవర్గంలో టిడిపి పూర్వ వైభవానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మాతల తన స్వగృహంలో నియోజకవర్గంలోని క్లస్టర్లు, యూనిట్ ఇన్‌ఛార్జిలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, నాయకులు డాక్టర్ మోహనరావు, లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, మతల గాంధీ, సిహెచ్.శ్రీనివాసరావు, కోటి పాల్గొన్నారు.

కెజిబివి సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని రాజాం కస్తూరిబా పాఠశాలను మంగళవారం సిఎంఒ హరికృష్ణ, ఎపిఒ నలినీకాంత్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి బోధనపై ఆరా తీశారు. అలాగే మధ్యాహ్నం భోజనం, మెనూ అంశాలను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఒ కాంతమ్మ, ఆధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సరుకుల కమీషన్ ఇవ్వాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

ప్రజాశక్తి- పలాస

ఎన్నో ఏళ్లుగా పెండింగ్, ఐసిడిఎస్ సరుకులు అందించిన కమీషన్ ప్రభుత్వం నుంచి నేరుగా రేషన్ డిపో డీలర్ల ఖాతాకు వచ్చే చూడాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు డి.సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం వద్ద రేషన్ డిపో డీలర్లు తమ సమస్యలపై మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఎంఎల్ఎస్ గొడౌన్‌లో 50 కేజీల కాటాలను ఉపయోగించి గ్రాములను క్వింటాల్లోకి మళ్లించే విధంగా సాఫ్ట్‌వేర్ తయారు చేసి డీలర్లకు సరుకులను డిస్పాచ్ చేస్తున్నారని అన్నారు. వేర్ హౌస్ గొడౌన్ నుంచి లారీల్లో వచ్చిన సరుకులు కాటాపై వేయకుండా స్టేజ్-2 కాంట్రాక్టు వెహికల్‌పై వేసి డీలర్లకు బస్తాలు పంపిణీ చేయడం ద్వారా తరుగువస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎస్ గొడౌన్లో 30 క్వింటాలు బరువు తూయ గలిగే కాటాతో ఈ-పాస్ మిషన్లకు అనుసంధానం చేసి డిపో నంబరు సరుకులు ఆ నెంబరు డిపో డీలర్ తంబుతో సరుకు డిస్పాచ్ చేయాలని కోరారు. ఈ-పాస్ మిషన్ బిల్లులు గోనిసంచుల బరువును మినహాయించి బియ్యం బరువుకి మాత్రమే బిల్లులు వచ్చే విధంగా చేయాలన్నారు. ఒక బరువు కాటాపై వేసినా పలు దఫాలుగా బిల్లులు రాకూడదని, ఆ బరువు దించి కాటాలో జీరో అయిన తరువాత మరలాబరువు వేసినచో బిల్లు వచ్చే విధంగా ఉండాలని కోరారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో లంబాడ మోహనరావు, మెట్టు కామేశ్వరరావు, చలం, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా జ్ఞానభారతి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని జ్ఞాన భారతి విద్యాసంస్థ 38 ఏళ్లుగా దినదినాభివృద్ధి చెందుతూ ఎంతో మంది విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిందని కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ అధ్యక్షతన జ్ఞానభారతి 38వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులు, బోధన పద్ధతులు నూతన ఒరవడిని సృష్టిస్తూ... మంచి పేరు, గుర్తింపు పొందాలన్నారు. సంస్థ వ్యవస్థాపక దినోత్సవ రోజునే కార్యదర్శి జన్మదినం కావడంతో అభినందనీయమన్నారు. అనంతరం జోహార్‌ఖాన్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అంతకుముందు జ్ఞాన భారతి విద్యా సంస్థలకు చెందిన పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టీ రమణమూర్తి, రషీద్ సుల్తానా, ప్రేమ సర్తాజ్ ఖాన్, ఐ.బి.పండా, ప్రమోద్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న రాజ్యలక్ష్మి, రామారావు

'మధ్యాహ్న భోజనం' పరిశీలన


భోజనాన్ని పరిశీలిస్తున్న కూర్మారావు

ఆమదాలవలస : ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలు చేయాలని మండల విద్యా సంక్షేమ అధికారి పైడి కూర్మారావు సూచించారు. మండలంలోని అక్కులపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న గోరుముద్ద పథకాన్ని మంగళవారం పరిశీలించారు. మధ్యాహ్నం అందిస్తున్న భోజనం గురించి పిల్లలను అడిగి తెలుసు కొని సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం పిల్లల తల్లిదండ్రుల కమిటీతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు విద్యా కానుక, అమ్మఒడి పథకం, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి వేణమ్మ, మెట్ట లక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనుల పరిశీలన

వజ్రపుకొత్తూరు: రహదారి నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడే ప్రసక్తి లేదని ఆర్‌అండ్‌బి ఎఇ విక్రమ్ అన్నారు. మండలంలోని రేగులపాడు-నువ్వులరేవు తారు రోడ్డు పనుల్లో భాగంగా బెండుగేట్ వద్ద చేపడుతున్న సిసి రహదారి పనులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.25 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని అన్నారు. ఇప్పటికే కల్వర్టుల నిర్మాణాలు చేపట్టామన్నారు. వెంకటాపురం బెండు గేట్ వద్ద అవసరం మేరకు సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. బెండు గేటు వద్ద వర్షాకాలంలో రోడ్డుపైకి ఎక్కువగా వరద వస్తుందని, దీంతో తారు రోడ్డు పాడైపోతుందనే ఉద్దేశంతో 80 మీటర్లను పొడవనున్న 21 అడుగులు వెడల్పుతో సిసి రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ జోగారావు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎఇ విక్రమ్

రైస్‌మిల్లు కార్మికులపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి- మందస

రైస్‌మిల్లు కార్మికుల నూతన వేతన సవరణ చేయాలని నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్ష మంగళవారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైస్‌మిల్లు కార్మిక సంఘం నాయకులు కె.బాలకృష్ణ, దుర్యోధన, సిఐటియు మండల కార్యదర్శి పి.దేవేంద్ర మాట్లాడుతూ కార్మికులు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి నూతన వేతనాలు పెంచాల్సి ఉందని, గత వప్పందం పూర్తి అయినా యాజమాన్యాలు చర్చలకు సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునారని అన్నారు. బ్యాంకు గ్యారంటీ కట్టకుండా, రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేయకుండా కార్మికులు సమ్మె చేయడంతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని మాపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. రైస్‌మిల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేస్తున్న విధానాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమైన వేతన ఒప్పందాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్.దిలీప్, ఏకాసి, ధర్మారావు, ఎన్.లచ్చయ్య, పోలయ్య, బి.లచ్చయ్య, లోకనాధం, టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం


మాట్లాడుతున్న ఎంపిపి ఉషారాణి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.20,13,64,600 అంచనా బడ్జెట్‌ను రూపొందించగా, ఇందులో ఆదాయం రూ.20,18,32,100ల గాను, వ్యయం రూ.20,13,14,000లు కాగా, రూ.5,18,100లు మిగులుగా చూపించారు. వ్యయంలో అధిక భాగం రూ.16,94,33,000లు జాతీయ ఉపాధి హామీకి కేటాయించగా, సిబ్బంది జీతభత్యాలకు, ఇతర అలవెన్స్‌లకు రూ.2,28,46,600లను వ్యయం చేయనున్నారు. అలాగే మండల పరిషత్ సభ్యుల గౌరవ వేతనానికి రూ.8,28,800లను వినియోగించనున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరణ బడ్జెట్‌లో ఆదాయం రూ.19,15,14,100లు గాను, వ్యయం రూ.19,09,80,900లు కాగా, మిగులు రూ.5,60,200లగా పేర్కొన్నారు. దీనిని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించడంతో బడ్జెట్ తీర్మానించారు. ఈ మండల సమావేశానికి టిడిపి ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. సమావేశంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఎఒ మురళీకృష్ణ, వైస్ ఎంపిపిలు వండాన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ పాల్గొన్నారు.

ఆపరేటర్లకు పనిభారం తగ్గించాలి

శ్రీకాకుళం అర్బన్ : ఈపాస్ మిషన్లో సర్వర్ అప్‌డేట్ చేయడంతో కార్డుదారులు రెండు సార్లు వేలుముద్రలు వేయాల్సి వస్తోందని, దీంతో ఎండియు ఆపరేటర్లపై పనిభారం పడుతోందని ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల అధికారి డి.వి.రమణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చిన జిఒలను కిందస్థాయి అధికారులు సక్రమంగా అమలు చేసే చూడాలన్నారు. ఈ నెల 2న ఈ-పాస్ మిషన్‌లో సర్వర్ అప్‌డేట్ చేశారని అన్నారు. దీంతో కార్డుదారులు రెండుసార్లు తంబ్ వేయించి సరుకులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే హమాలీలకు ఇస్తున్న రూ.5 వేలు వేతనం సరిపోక పనిలోకి ఎవరూ రావడం లేదని వివరించారు. దీంతో ఆపరేటర్లే హమాలీల పనులు చేసుకోవాల్సి వస్తోందన్నారు. ఆపరేటర్ల వేతన బకాయిలు చెల్లించి గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎండియు ఆపరేటర్లు రాజా, మాధవ్, శంకర్, బాలకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సూర్యనారాయణ

కేలండర్ల ఆవిష్కరణ


శ్రీకాకుళం అర్బన్ : డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం ఆధ్వర్యాన ముద్రించిన వార్షిక కేలండర్లను, డైరీలను రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, కార్యదర్శి బి.వి.వి.ఎస్.రాజు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి జి.ఎల్.ఇ.శ్రీనివాసరావు, డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.గణపతిరావు, గార తహశీల్దార్ సనపల సుధాకర్ పాల్గొన్నారు.

టెక్కలి : జనవిజ్ఞాన వేదిక జిల్లాశాఖ ఆధ్వర్యాన ముద్రించిన కేలండర్లను, డైరీలను జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు టెక్కలి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. శాస్త్రీయ సమాజం నిర్మాణం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు పాలవలస ధర్మారావు, మల్లారెడ్డి పద్మనాభరావు, డొంకాన పాపారావు, రాజకుమార్, మోహనరావు, రోణంకి విజయ్‌కుమార్, సత్తారు రాంబాబు పాల్గొన్నారు. అలాగే తలసముద్రం సూర్యం ఆధ్వర్యాన కేలండర్లు, డైరీలను సబ్ కలెక్టర్ తాటిమూకల రాహుల్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెనుకబడిన కార్యాలయాల శాఖాధికారి, దివ్వల ప్రసాదరావు, ఎ.రాము పాల్గొన్నారు.

కవిటి : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎపిటిఎఫ్ సేవలు శ్లాఘనీయమని ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. స్థానిక మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో 2023 ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి బిసాయి, శమళ్ల రాజబాబు, ఉపాధ్యాయులు కొత్తపల్లి రంగారావు, బల్ల ధర్మారావు, మార్కండేయ బిసాయి, కేశవ పురియ, త్రిలోచన, మొర్రి గోపి, బల్లెడ ఉషారాణి, విజయలక్ష్మి, వంశి, మనోజ్, ధర్మారావు పాల్గొన్నారు.


కవిటి : కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ ధనుంజయ మజ్జి


టెక్కలి : జెవివి కేలండర్లను ఆవిష్కరిస్తున్న కామేశ్వరరావు



మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

బూర్జలో 'గడప గడపకు'

ప్రజాశక్తి- బూర్జ

నవరత్నాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారం అన్నారు. బూర్జలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల నుంచి పింఛన్లు రూ.2,750 పెంచిందన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బూర్జకు ఆర్‌టిసి బస్సు వేయాలని గ్రామస్తులు కోరారు. స్పీకర్ వెంటనే స్పందించి ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్ణేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, సర్పంచ్ ఏగు అనురాధ, కృష్ణ పాల్గొన్నారు.




సమీక్షిస్తున్న మంత్రి అప్పలరాజు

సమస్యల పరిష్కారానికి చర్యలు

పలాస : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడపగడపకు వైసిపి కార్యక్రమంలో వస్తున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను ఆదేశించారు. పలాస ప్రగతి భవనంలో మంగళవారం పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లతో, ఎంపిడిఒలతో, ఎంపిపిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. సమస్య వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు, ఫించన్లు, రేషన్ కార్డులు అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు బి.పాపారావు, ఎల్.మధుసూదనరావు, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటారావు చిట్టి పాల్గొన్నారు.

సుధాకర్‌ను పరామర్శ

మండలంలోని బొడ్డపాడు మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్ తల్లి గంగమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం స్వగ్రామం వెళ్లి సుధాకర్‌ను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటారావు చిట్టి, బొడ్డపాడు సర్పంచ్ తామడ మధన్, ఉద్దాన ప్రాంత పంచాయతీ అధ్యక్షులు సైని దేసయ్య, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సొర్రా తిరుపతిరావు, గేదెల సూర్య ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జాతరకు సహకరించాలి

రణస్థలం: మండలంలోని కోటపాలెం చేరిలో సంక్రాంతి పండగకు నిర్వహించనున్న భద్ర మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జాతర ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ, ఆలయ కమిటీ సభ్యులు పకడ్బందీగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు పలు సూచనలు, అభిప్రాయాలను కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, ఎస్ఐ రాజేష్, మండలం బూత్ కమిటీ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, పైడిభీమవరం పిఎసిఎస్ చైర్మన్ గొర్లె తిరుపతినాయుడు, కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, నాయకులు కురిటి రామకోటి, కోటపాలెం ఎంపిటిసి సుంకరి కిషోర్‌కుమార్, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, జీరుపాలెం సర్పంచ్ రాముడు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న '108' ఉద్యోగులు

మంత్రిని కలిసిన '108' ఉద్యోగులు

పలాస: 108 ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని 108 ఉద్యోగులు కోరారు. మంత్రి కార్యాలయం వద్ద మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మంగళవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో యాజమాన్యం వచ్చిన తర్వాత టెర్మినేషన్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సిఎం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో తారక్, వెంకటరావు, మురళీమోహన్, కె.వి.రమణ, తిరుపతిరావు, నారాయణరావు, రాజేష్, పి.సత్యం, కె.శ్రీనివాసరావు, ఆనంద్ మోహన్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం సందర్శన

మెళియాపుట్టి : మండలంలో ముక్తాపురం అంగన్వాడీ కేంద్రంలో ప్లాస్టిక్ రైస్ వినియోగిస్తున్నట్లు ఓ ఛానల్లో వచ్చిన కథనంపై సారవకోట సిడిపిఒ హెచ్.కె. కామాక్షి మంగళవారం సందర్శించి దర్యాప్తు చేపట్టారు. అది ప్లాస్టిక్ రైస్ కాదని ఫోర్టిఫైడ్ రైస్ అని ధ్రువీకరించారు. అలాగే ఇక్కడి లబ్ధిదారులతో మాట్లాడారు. ఫోర్త్ ఫైడు రైస్‌పై అవగాహన కల్పించారు. ఆమెతో పాటు ఎసిడిపిఒ సిహెచ్.హైమావతి, సూపర్‌వైజర్ సునీత, స్థానిక నాయకులు ఉన్నారు.



దర్యాప్తు చేస్తున్న సిడిపిఒ కామాక్షి

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

లావేరు : మండలంలోని అదపాక ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన హెచ్‌ఎం వి.సత్యనారాయణ అధ్యక్షతన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బాలికల విద్య, స్త్రీ హక్కుల కోసం పూలే తన జీవితాంతం కృషి చేశారని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ భర్త జ్యోతి బాయి పూలేతో పాటు సావిత్రి బాయి పూలే బాల్యవివాహాలకు వ్యతరేకంగా పోరాటం చేశారన్నారు. బాలికల విద్య కోసం పాఠశాలలను స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి జగన్నాథరావు, గుంటకు మురళి, కాగాన ముకుందరావు, లక్ష్మణరావు, ఉదయ్‌కుమార్, వాసుదేవరావు, గుణలక్ష్మి, ఎస్.రాజేశ్వరి పాల్గొన్నారు.

మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కవిటి: ఆధునిక విద్యతోనే స్త్రీకి విముక్తి లభిస్తుందని సావిత్రిబాయి పూలే భావించారని ఎంఇఒ ధనంజయ్ మజ్జి అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక ఎంఆర్‌సి వద్ద ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు



జి.సిగడాం : సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థి విశాశిని



లావేరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

వరలక్ష్మి, బి.ఉషారాణి, ఎ.విజయ, బి.భారతీదేవి, లక్ష్మీబాయి, బి.తేజస్వి, కె.రంగారావు, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు కె.వైంకుఠరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు యామిని, వాసంతి, అరుణకుమారి, లక్ష్మీబాయి, రాజేశ్వరిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

బూర్జ : మండలంలోని ఓ.వి.పేటలో ఉన్న ఆదర్శ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండలంలోని అద్దానంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు అరుణ కుమారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే విద్యార్థులతో సావిత్రిబాయి పూలే వేషధారణ వేయించారు. కార్యక్రమంలో సీతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకులు ఎ.ఝాన్సీ, ఎ.సరస్వతి, బి.సాగరిక, డి.మమత, ఎస్.భవానిలకు ప్రిన్సిపాల్ వెంకట మోహన్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎజిఎంఒ పి.చిరంజీవులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాప పాపారావు పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో సావిత్రి బాయి పూలే సందర్భంఆ మహిళా ఉపాధ్యాయులకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రమణ, చలం, ఓంకార్, జి.మధుసూదనరావు, సంతోష్, జయరాం, నగేష్ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని పెద్దతామరాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు డి.సంధ్యారాణికి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

టెక్కలి రూరల్ : మండలంలోని సీతాపురం ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపకాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయరాలు సత్తారు వేణు కూమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ కణితి కిరణ్‌కుమార్ సావిత్రీబాయ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పేడాడ త్రివేణి, కొత్తూరు హరి, కుమారస్వామి, మెట్ట నరేష్, క్రాంతి, గణపతి పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బేవల



టెక్కలి : మహిళా అధ్యాపకులను సన్మానిస్తున్న సహచరులు



పలాస : మహిళా లెక్చరర్లను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ వెంకట మోహన్

సతీష్‌కుమార్, చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య, కార్యదర్శి పొట్నూరు జగదీష్, కాపల నారాయణరావు, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి, నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు, ప్రణవి విద్యా సంస్థలో చైర్మన్ పేడాడ పరమేశ్వరరావు, కరస్పాడెంట్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, బిసి బాలికల వసతిగృహంలో సమతా సైనిక్ దల్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావు పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వజ్రపుకొత్తూరు : బాలికల విద్యకు ప్రోత్సాహం అందిస్తే విద్యారంగంలో మంచి ఫలితాలు సాధ్యమని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లఖినాన కరుణాకర్ అన్నారు. ఉద్దానం రామకృష్ణాపురం పాఠశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రమేష్, పిఎంసి చైర్‌పర్సన్ చింత కళ్యాణి, జి.తులసీదాస్, కె.రామకృష్ణ, ఆర్.లక్ష్మణరావు, బి.ప్రతాప్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక ఎంఆర్‌సిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికిఎంఇఒ ఎస్.దేవేందరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే చేపర, గొప్పిలి, పెద్దలక్ష్మీపురం, కరజాడ, మెళియాపుట్టి తదితర ఉన్నత పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

7న శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పలాస

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ హబ్ సెంటర్లల్లో ఉపాధి శికణా కోర్సులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్, పలాస ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్ కోరారు. పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో డాక్టర్ వి.కణితి, ప్రభుత్వ ఐటిఐలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరిలో ఫిట్టర్ ఫాబ్రికేషన్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్ కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు. ఫిట్టర్ ఫాబ్రికేషన్ కోర్సుకు పది, ఆ పైన చదివిన ఉత్తీర్ణులని పేర్కొన్నారు. 18-30 ఏళ్ల లోపు వయసు ఉన్న పురుషులు అర్హులని తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్ కోర్సుకు



పలాస : ఐటిఐని పరిశీలిస్తున్న శ్రీనివాస్

ఎనిమిదో తరగతి, ఆ పైన పాసై ఉండాలన్నారు. 18-30 ఏళ్ల లోపు వయసు ఉన్న పురుషులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తారని చెప్పారు. శిక్షణకు సంబంధించి జనవరి 7న ప్రీ-అసెస్మెంట్(స్క్రీనింగ్ టెస్ట్) ఉంటుందన్నారు. అభ్యర్థులందరూ తమ సర్టిఫికేట్లు, ఆధార్ జెరాక్స్‌లో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు హబ్ కో-ఆర్డినేటర్ 6301046329 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ నియోజకవర్గ యువకులకు ఈ నెల 7న ఉచిత ఉపాధి శిక్షణా కోర్సులు ప్రారంభించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఆధికారి పి.బి.సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్ కోర్సు, ఫ్రంట్ ఆఫీస్ ఆసోసియేషన్ కోర్సు వంటివి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విదార్థులు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు 949329002 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు.



పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తాగునీటి కుళాయి పనులు ప్రారంభం

సంతబొమ్మాళి: మండలంలోని మేఘవరం పంచాయతీలో పాత మేఘవరం, చిధపానవానిపేట గ్రామాల్లో రూ.27 లక్షలతో ఇంటింటి తాగునీటి కుళాయి పనులను సర్పంచ్ పరపటి సునీత, ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంక సోమేశ్వరరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, వైస్ సర్పంచ్ మంకు సింహాచలం, గ్రామ పిళ్ల బైపల్లి పున్నయ్య, నాయకులు సిరిగిడి రాము, చిదపాన శంకర్‌రెడ్డి, కంబాల వెంకటస్వామి పాల్గొన్నారు.

8న వన భోజనం

వజ్రపుకొత్తూరు : కళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన ఈ నెల 8న చినబడాం మామిడి తోటలో నియోజకవర్గ స్థాయి వన భోజనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ సంఘం ప్రతినిధులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని మహాదేవిపురం, బెండి, బట్టుపాడు, పూండిగల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేపట్టామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కళింగ తరగతికి చెందిన వారు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో దువ్వాడ హేమబాబుచౌదరి, దువ్వాడ శ్రీకాంత్, మల్లా రవి, బడ్డ నాగరాజు, మన్మథరావు, కింతలి శంకరరావు, ఉప్పాడ కృష్ణారావు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరగాళ్లపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని గాజులకొల్లివలసలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి మన బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. అలాగే ఎటిఎం కార్డులు అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని ఇవ్వరాదని సూచించారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం రూ.12కు రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు గల వ్యక్తులకు ఇది వర్తిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన వార్షిక ప్రీమియం రూ.330కు రూ.2 జీవిత బీమా లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల వయసు గల వారికి ఇది వర్తిస్తుందని చెప్పారు. అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరితే తక్కువ పెట్టుబడితో వృద్ధాప్యంలో అధిక ప్రయోజనాలను పొందవచ్చని సూచించారు. డిజిటల్



అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

పేమెంట్స్ వాటి వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు, అలాగే ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మొండేటి కూర్మారావు, వాలంటీర్లు సత్యవతి, భారతి, ఆర్థిక అక్షరాస్యత సిబ్బంది రామారావు పాల్గొన్నారు.



ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

యోగాతో ఆరోగ్యం

జలుమూరు: రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడంతో పలు వ్యాధులు దూరం అవుతాయని జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి తాడేల శ్రీకాంత్ అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయుష్ శిక్షణా తరగతులు విజయవంతమయ్యాయని అన్నారు. ఈ మేరకు పెద్దదుగాం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ కె.తిరుమల వెంకటసాయికి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ మంగళవారం శిక్షణా ధ్రువపత్రం అందించారు. కార్యక్రమంలో డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మావతి, ఎన్.రాజ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నరాజులు, అల్లు చిన్నబాబు పాల్గొన్నారు.

వచ్చే నెల 28లోగా సర్టిఫికేట్లను సమర్పించాలి

పొందూరు : విశ్రాంత ఉద్యోగులు ఫిబ్రవరి 28 లోగా లైఫ్ సర్టిఫికేట్ల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విశ్రాంత ఉద్యోగుల మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పాలిశెట్టి సూర్యప్రకాశరావు కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్, ఐరిస్ ద్వారా సమర్పించుకోవచ్చునని పేర్కొన్నారు. ఆధార్‌తో లింకయిన ఫోన్, పిపిఒ, సిఎఫ్ఎంఎస్ నంబర్లను తీసుకుని వెళ్లాలని కోరారు. బయోమెట్రిక్, ఐరిస్ విఫలమైతే మాత్రం సంబంధిత ట్రెజరీ పరిధిలోని డ్రాయింగ్ ఆధికారితో ధ్రువీకరించిన దరఖాస్తును, ఫొటోలను అతికించి ఎస్‌టిఒకు అందజేయాలని తెలిపారు.

వివాహిత అప్పగింత

కోటబొమ్మాళి: కొత్తపేటకు చెందిన వివాహిత అదృశ్యమైందని అమె కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ షేక్‌ఖాదర్ భాష ఆధ్వర్యాన 24 గంటల్లో కేసును ఛేదించారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త, తల్లిదండ్రులకు మంగళవారం అప్పగించారు. ఇంట్లో జరుగు కుటుంబ కలహాలు కారణంగా భర్తకు దూరంగా ఉండాలని ఉద్దేశంతో ఎవరికీ చెప్పకుండా తన బంధువుల ఇల్లు భామిని వెళ్లిపోయిందని ఎస్ఐ తెలిపారు. ఎఎస్ఐ నాగభూషణరావు, కానిస్టేబుల్ దుర్గారావు పాల్గొన్నారు.



బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంపిపి దాసు

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపిపి డాక్టర్ నిమ్మాన దాసు 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను అందజేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. నిరుపేద విద్యార్థులకు సైతం సాంకేతిక, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలన్న లక్ష్యంతో సిఎం జగన్ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని మంచి భవిష్యత్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, వైస్ సర్పంచ్ మల్ల వెంకటరమణ, నాయకులు పొడుగు కామేష్, పి.గిరిబాబు, తోట ఢిల్లీరావు, పి.సులోచన, కమల, జానకి, పార్వతి, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో చాపర ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఆర్ట్స్ కాంపిటేషన్-2023 కోనసీమ చిత్రకళా పరిషత్ అమలాపురం ఆధ్వర్యాన ఇటీవల చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ఆరుగురికి బంగారు, ఒకరికి వెండి పథకాలు లభించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డ్రాయింగ్ టీచర్ మాధవరావుకు ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

తామర పురుగుపై అప్రమత్తం

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త విశాలాక్షి



మిరప పంటను పరిశీలిస్తున్న విశాలాక్షి

ప్రజాశక్తి- రణస్థలం

మిరప పంట పూత, పిందె దశలో నల్ల తామర పురుగు ఆశించడం వల్ల పూత పిందెగా ఏర్పడకముందే రాలిపోతుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సస్యరక్షణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి అన్నారు. మండలంలోని వి.ఎన్.పురంలో మిరప పంటలపై నిర్వహిస్తున్న ప్రయోగ క్షేత్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిరప సాగుచేస్తున్న రైతులు పూత దశలో ఆశించే తామర పురుగుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లేని ఎడల దిగుబడుల పరంగా ఎంతో నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని సూచించారు. దీని నివారణకు తామర పురుగులు గుర్తించిన తొలి దశలో బవేరియా, లెకనసిల్లియం, బాసిల్లస్, సూడోమోనాస్ వంటి జీవశిలీంధ్ర పొడి మందులను లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి మొక్క అంతటా తడిచేలా వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల తామర పురుగు నియంత్రణకు రసాయన మందులపై పెట్టే ఖర్చు ఆదా అవడమే కాకుండా, పురుగు ఉధృతి తగ్గుతుందని అన్నారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరి బాబు, సమన్వ యకర్తలు బి.లక్ష్మీనరసింహమూర్తి, పి.రమణ, జి.భానుమూర్తి, జె.గోపాల్, రైతుమిత్రలు రెడ్డి గోవిందరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - రణస్థలం

మొక్కజొన్న పంటకు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను పండించాలని, దీనివల్ల ఆరోగ్యమైన పంటలను పండించవచ్చునని నేచురల్ ఫార్మింగ్ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అన్నారు. రణస్థలంలో మొక్కజొన్నలో 6వ వారం భాగంగా మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతితో పంటలు పండిస్తే తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం సంపాదించవచ్చునని అన్నారు. రైతులు బీజామృతంతో విత్తన శుద్ధి, మొక్కజొన్న నాటిన 15 రోజుల్లో 200 లీటర్ల నీమాస్త్రం పిచికారీ చేయాలన్నారు. పురుగు



శిక్షణ ఇస్తున్న కృష్ణ

ఉధృక్తతను తెలుసుకోవడానికి ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలను, నివారణకు 10 నుంచి 15 లింగాకర్షకు బట్టలను పెట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ యాంకర్ జి.రాంబాబు, రణస్థలం డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.